# మూగజీవాలు

## ఆదిరెడ్డి

"అయ్యగారూ..... అయ్యగారూ.. ఎవరో మనుమలు చేసిన తప్పుకి అన్యాయంగా నోర్లేని యీ పశువుల్ని హింసించడం దేనికండయ్యగారూ.... ఆటి కేసొక్కసారి చూడండి! మూడు దినాల్నుంచి నోరాడే దార్లేక ఎట్టా నకనకలాడుతున్నాయో?! చిన్నయ్యగారో మీరైనా చెప్పండి! ఈ పశువుల్ని ఆ కొండయ్యకి అప్పజెప్పేద్దాం...."

ఆకలి చూపుల్తో దిక్కులు పిక్కటిల్లేలా ఉండుండి అరుస్తూ, కట్టి పడేసిన గుదికొయ్యల చుట్టూతా వెర్రెత్తినట్టు తిరుగాడుతూ స్వేచ్ఛకోసం చించుకుంటున్న పశువుల్ని వెన్ను నిమురుతూ అంటున్న గోపన్న కళ్ళల్లోని ఏదో అంతు తెలియని ఆవేదన్నీ, వాడి లేలేత హృదయంలో చెలరేగుతున్న భీభత్సాన్నీ రాఘవయ్య మౌనంగానే గమనిస్తున్నాడు.

వాటిపై ఆపసివాడు చూపే వివక్షత కూడా తాము చూపించలేక పోయినందుకు అతనిలో అవమానపు ఛాయలు అగుపించేయి.

రాఘవయ్య గోపన్నకేసి క్షణికకాలం సేపు కన్నార్పకుండా అలాగే చూస్తూ వుండి పోయాడు.

ఈ సృష్టిలో నవమాసాలూ కడుపున మోసి కని పెంచిన బిడ్డకూ తల్లికీ వున్న మమతానుబంధమూ, అహర్నిశలూ ప్రాణాల్ని సైతం లెక్కచేయక నరాల్లోని రక్తాన్ని పంటచేలకు నీరుగా పోసి పండించిన పంటకూ వ్యవసాయ దారుడికీ మధ్య వుండే అవినాభావ సంబంధమూ ఒకేలా తోచాయి క్షణంలో రాఘవయ్యకి గోపన్నను చూస్తుంటే.

ఏక్షణాన ఏ ఆపదవాటిల్లినా ఆ బిడ్డ కోసం ఆ మాతృమూర్తి ఎంతటి ఆవేదనకు గురవు తుందో, కళ్ళెదుటే కనుపాపలా చూస్కుంటున్న పంటకి హఠాత్తుగా ఏ నష్టం సంభవించినా అదే ఆవేదన ఆకృషీవలుడ్ని తీరని మనస్తాపానికి, సంక్షోభానికి గురి చేస్తుంది.

ఇప్పుడూ అంతే జరిగింది!

పశువుల వల్ల ధ్వంసమైన పంటని చూసి అందరికంటే ముందు గోపన్నే మరింత కలత చెందిపోయేడు.

వాడి ప్రతి కదలిక లోనూ వాడి గుండెకు కలుగుతున్న ఒత్తిడి వాడి కంటి చూపుల్లో కదలాడ్తోంది.

"ఏంట్రా గోపన్నా అట్టా అంటావూ.... ! యీ గొడ్లు మన పొలానికి కల్గించిన నష్టం అప్పుడే మర్చి పోయేవేట్రా . !" రాఘవయ్య అనునయంగా గోపన్న కేసి అన్నాడు.

"అవుననుకోండి.... పాపం! యీటికేటి తెల్సు యిదంతా ఆ కొండయ్య పనేగదా.... .!"

"అందుకేరా.... ! కొన్నాళ్ళిలా వీటిని కట్టి పడేస్తే ఆనాయాళ్ళకు బుద్దొస్తది! నీకేం తెలీదు! నువ్ నోర్మూసుకు పడుండ్రా సన్నాసి . రెండ్రోజుల్దాకా పచ్చి నీళ్ళు కూడా మూతిబెట్టనీ కూడదు బోధపడిందా.. ..!?"

ఆవేశంగా అంటున్న శంకరయ్య గుండెలో క్కసారి ఎగిసాయి. పశువుల్ని కసి కసిగా చూస్తూ కళ్ళెర్ర జేసాడు.

"అమ్మో ... రెండ్రోజులే. చచ్చిపోవూ.... ?"

ఆ రోజు ఎప్పటిలాగే గోపన్న దిన చర్యలో భాగంగా శాల్లోని పశువుల్ని మేతకు పెట్టి తాను పొలానికి నీరు పెడ్తుండగా అనుకో కుండా అవి పక్కనే వున్న కొండయ్య చేలో ప్రవేశించేయి.

అయినా పంటకేమాత్రమూ నష్టం సంభవించక ముందే తేరుకున్న గోపన్న ఉన్నపళంగా పోయి వాటిని యిటు తోలుకొచ్చేసేడు.

అంతమాత్రానికే ఆ కొండయ్య మనుమలు ఆ గొడ్లుల్ని అన్యాయంగా దుడ్లుల్తో బాదేరు.

అక్రమంగా గోపన్నను కొట్టేరు

అది తెలిసి పరుగెత్తుకొని పోయిన శంకరయ్య మీద కూడా దురుసుగా ప్రవర్తించేరు.

అంతటితో తృప్తి చెందక ఆ రాత్రికి రాత్రే రాఘవయ్య పొలాల్లో పశువుల్ని విచ్చల విడిగా వొదిలి పంటనంతా తొక్కించి నాశనం చేయించేడు ఆ కొండయ్య.

అసలు తాత ముత్తాతల్నుంచి కొనసాగుతూ వస్తున్న తగాదాల్ని పెంచుకోవడం రాఘవయ్య కేమాత్రమూ యిష్టం లేదు. అందుకే ఆ కొండయ్య విషయంలో మొదట్నుంచి సౌమ్యంగానే వ్యవహరిస్తూనే వస్తున్నాడు.

దాన్ని ఆసరాగా తీస్కొని కొండయ్య చేసే ఆగడాలు రాఘవయ్య సహనానికి పరీక్షగా తయారవుతున్నాయి ఎప్పటి కప్పుడు దీంతో ఆయన ఓర్పు చల్లారి పోయింది.

ఇకపై అతని దుష్ప్రవర్తనలకు ప్రతిఘటంగా వుండాలను కున్నాడు. తగిన శాస్తి చెయ్యాలని నిశ్చయించు కున్నాడు.

తత్ఫలితంగా ఆ కొండయ్య పశువుల్ని బలవంతంగా యీడ్చుకొచ్చి కట్టి పడేస్తున్న శంకరయ్యకు అడ్డు చెప్పలేకపోయేడు తను.

మూడ్రోజుల్దాకా వాటిని నిర్బంధంలో నే వుంచేసారు. చేసిన తప్పుకి ప్రాయాశ్చిత్తంగా ఆ కొండయ్య తేలుకుట్టిన దొంగలా ఎదురు తిరిగి అడిగే ధైర్యం చేయలేక పోయేడు.

ఆ తర్వాత ఆ కొండయ్యే రాజీపడి తన మనుమల్ని పంపితే వాటిని అప్పగించేసేరు.

ఇంకెప్పుడూ తన వాళ్ళనిగాని, పంట పొలాల జోలికి గాని రాడన్న విశ్వాసంతో రాఘవయ్యా వాళ్ళూ ఊర్కున్నారు. అంతటితో

* * *

ఆ వర్నాడు పొద్దున్ననగా పొలానికి పోయిన గోపన్న ఎంతకీ యింటికి తిరిగి రాలేదు.

తోలుకు పోయిన గేదెలూ, ఆవులూ మాత్రం యధాప్రకారంగా చీకటి పడకముందే ఇంటికి చేరుకున్నాయి.

ఏం జరిగింది!

రాఘవయ్య ఆలోచిస్తూనే ఇంట్లో నుంచి బయటి కొచ్చేడు.

పాలేరు పాపయ్య అప్పుడే పాలు పితికే కార్యక్రమానికి పాలకుండల్తో తయారయ్యాడు.

"ఏంరా పాపిగా.. . మన గోపన్నేమయ్యేడు!?"

రాఘవయ్య అడిగేడు.

"కుర్రకుంక .. ఏ ఆటలో పడ్డాడో . వీటి మానాన వీటి నొదిలి!"

"చీకట్లో అక్కడేం ఆటల్రా ..! నీ మొహం?"

"పాపం! పొద్దంతా పన్జేసి ఎక్కడ పడుకొని వుండి పోయేడో.... సమయానికి శంకరయ్యా కూడా లేడు!"

అన్నపూర్ణమ్మ భర్త వంక ఆతృతగా చూసింది.

ఆ చీకట్లో ఎక్కడ తనను పంపిస్తారేమోనని పాపయ్య తలొంచుకుని తనపని తాను కానించే ప్రయత్నం చేసేస్తున్నాడు.

కాని అందుకు ఆవులు మాత్రం నిరాకరిస్తూ బెదిరిపోతున్నాయి. కాళ్ళతో తన్నుతున్నాయి

అర్ధాంతరంగా అవెందుకిలా యిబ్బంది పెడ్తూ మొరాయిస్తున్నాయో వాడి బుర్రకి తట్టడం లేదు.

పాపయ్య మళ్ళ ప్రయత్నించేడు.

హు! లాభం లేదు!!

"తన్నకేం చేస్తాయిరా! వాడు ముందు లేకుండా ఆవేనాడైనా పాలిచ్చేయా?! ఆ దొచ్చి పచ్చగడ్డి కుడుపితే గాని పొదుగు మీద చెయ్య వెయ్య నిస్తాయా.... !?"

ఉన్నట్టుండి రాఘవయ్య ఇంట్లోకి పోయి లైటర్తో బయటి కొచ్చి "పూర్ణా! నే పొలానికి పోయొస్తా" నంటూ బయల్దేరాడు గోపన్న కోసం.

సరిగ్గా అప్పుడే "నానమ్మా..... నానమ్మా" అంటూ చిన్ని వచ్చి అన్నపూర్ణమ్మ దగ్గరకు చేరింది.

"ఏంవమ్మా? చిన్నీ!" అంటూ మనవరాల్ని ఎత్తుకుని అడిగింది.

"మరే! గోపన్నింకా యింటికి రాలేదేం?"

చిన్ని అలా ఎందుకు ప్రశ్నించిందో అన్నపూర్ణమ్మకు అర్ధమై పోయింది.

రోజూ యీ పాటకి గోపన్న పొలాన్నుంచి తెచ్చిచ్చే

మామిడి కాయలూ , బొబ్బర్లూ, వేరు శనక్కాయలూ తింటూ వుండేది చిన్ని.

అల్లంత దూరాన పశువుల్ని చూసి 'గోపన్నొచ్చాడోచ్' అని గెంతుకుంటూ వాడి కెదురెళ్ళి మరీ తీస్కొంటుంది వాడు తెచ్చేవి.

గోపన్న "చిన్నీ ! నీకివేళేం తెచ్చానో చెప్పుకో" అంటూ చిన్ని కంట పడనీకుండా రెండు చేతుల్నీ వెనక్కి పెట్టి మురిపించేవాడు.

ఆ యింట్లో గోపన్న రాకకోసం ఎదురు చూసేది చిన్ని మాత్రమే అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే చిన్ని ఆడుతూ పాడుతూ చనువుగా తిరిగేది వాడితోనే.

రాఘవయ్య పొలం చేరే సమయానికి గోపన్న పంట చేల చుట్టూ పహార్లు చేస్తూ తిరుగాడుతుండటం చూసేడు.

లైటర్ వెలుగులో వాడి ఆకారం మాత్రమే కన్పిస్తోంది.

"ఏంరా.... ! యింకా యిక్కడే వున్నావేం?! కూడు తినవా ఏంటి.... ?!" వాడి మొహం కేసి గుచ్చి గుచ్చి చూసి అడిగేడు రాఘవయ్య.

"లేదయ్యగారూ.... ! యిక్కడెవరూ లేకపోతే పొలానికి కాపలా ఎవరుంటారు?! ఆ కొండయ్య అసలే పాపిష్టోడు.... మన పంట కేమైనా చేస్తే!?" ఆ మాటలు వింటున్న రాఘవయ్యకి గోపన్న తండ్రి వీరన్న గుర్తొచ్చేడు.

తన పాతికెకరాల మెట్ట పొలాన్ని కంటికి రెప్పలా కాచుకుంటూ తననినాడు ఓ పెద్ద భూస్వామిని చేసేడు.

వీరన్న మూలాన్నే మరో పాతికెకరాల భూమికి అధికారి అయ్యేడు అతి కొద్ది కాలంలోనే రాఘవయ్య.

వీరన్న కాడెపట్టి భూమి దున్నితే అందులో రత్నాలు పండేవి. ఏ ఏటకాయేడు రెట్టింపు దిగుబడి వచ్చేది వీరన్న శ్రమఫలితంగా.

అందులో ఏమాత్రం వాటాకి ఆశించే వాడు కాడు వీరన్న. "దిక్కులేనోడ్ని.... నా కెందు కండి .... మీ నీడన పెళ్ళాం బిడ్డల్తో వుండనిస్తున్నారు..... నోట మెతుక్కి లేనోడికి పెళ్ళి చేసి ఓ యింటి వాడ్ని చేసేరు..... అది చాలం"టూ వీరన్న భక్తిగా అనేవాడు.

వాడి నిరాడంబరత్వానికి, నిస్వార్థానికి రాఘవయ్య ఆశ్చర్య చకితుడయ్యేవాడు.

మంచివాళ్ళకూ, నిస్వార్థ జీవులకూ యీ లోకంలో చోటు లేదంటూ గోపన్న పుట్టిన అయిదేళ్ళకే ఆ వూరికి వ్యాపించిన కలరా వీరన్నను కూడా బలితీసుకుంది.

భర్త పోయిన కొన్నాళ్ళకే రంగి కూడా తనువు చాలించింది గోపన్నను ఒంటరి వాడ్ని చేసి.

అప్పట్నుంచి రాఘవయ్య, అన్నపూర్ణమ్మలే వాడికి తల్లిదండ్రులయ్యేరు.

"మరి రాత్రి తిండి తినవా?!"

రాఘవయ్య గోపన్నను ప్రశ్నించేడు.

"పొద్దున్న తెచ్చుకున్న సద్దింకా వుంది."

"బాగుంది....! ఇంటికి రారా వేడన్నం కాస్త తిందువు గాని.... అవతల పాలు తియ్యాల!" వాడ్ని గదమాయించేడు.

గోపన్న రాఘవయ్యతో ఇంటి కొచ్చి పాలు పితికే కార్యక్రమం ముగించుకుని కాసింత కూడు తిని మళ్ళీ శంకరయ్యతో ఆ రాత్రి కాపలా కొచ్చేసాడు.

* * *

ఆరోజు పండగ రోజు కావడంతో రాఘవయ్య ఇంటి నిండా చుట్టాలే. అతిథి మర్యాదల్తో అంతా సందడి సందడిగా తయారయ్యింది.

అదిగాక పట్నంలో పెద్ద చదువులు చదువుకుంటున్న రాఘవయ్య చిన్న కొడుకు గిరిశం రాకతో ఇల్లు మరింత కళకళలాడుతోంది.


గిరిశం విశ్వ విద్యాలయంలో చదువుతూ దేశంలోని 'ఆహార సమస్య' గురించి రీసెర్చి చేసినందుగ్గానూ ఈ మధ్యనే అతనికి అవార్డు లభించింది కూడా.

చిన్న కొడుకు తన పేరు నిలబెడ్తూ సంఘంలో తన కీర్తి ప్రతిష్ఠల్ని పెంచుతున్నందుకు రాఘవయ్య ఎంతో ఉప్పొంగి పోయేడు.

పండగ శెలవుల్ని తన వూర్లోనే గడపాలంటూ గిరిశం స్నేహితుల్ని కూడా వెంట బెట్టుకొచ్చేడు.

తమ్ముడి పరువు నిలబెట్టడం కోసం శంకరయ్య వాళ్ళకి సకల సదుపాయాల్ని కల్పిస్తున్నాడు.

ఇంక అన్నపూర్ణమ్మ సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఊపిరి తిరగని పన్లు.




కోడలు సాయంతో పండగ ఏర్పాట్లన్నీ ఘనంగానే చేసేస్తోంది అన్నపూర్ణమ్మ.

ఉదయం టిఫిన్ కార్యక్రమాలవీ ముగిసేక కాసేపు పేకాడి తర్వాత ఫ్రెండ్సుని వెంట బెట్టుకుని అలా పొలం వాతావరణంలోనికి బయల్దేరేడు గిరిశం.

రండి! రండి! మిరొస్తారని ముందే తెల్తితాటి ముంజలు వొల్చి మరి వుంచేను తినండి

గోపన్న చిన్న బుట్టతో ముంజుల్ని వాళ్ళ ముందుంచేడు వాళ్ళని ఆహ్వానిస్తూ

'ఎడే మా పొలంలో పన్జేసే కుర్రాడు! పేరు గోపన్న. ఎడికి పశువులూ పొలాలూ తప్ప వేరే లోకం లేదు! ఒట్టి బైతుగాడు! అప్పుడప్పుడు అలా వూళ్ళో తిరిగి కాస్త నాగరికత వంట బట్టించుకోరా అంటే పట్టించుకోడు . ఎడిలాంటి వాళ్ళకి పంట చేలే ప్రపంచం రెండో పని చేతకాదు!'

గిరిశం తాటి ముంజుల్ని ఫ్రండ్స్ కందిస్తూ వెటకారం చేస్తూ అంటున్నాడు

వాళ్ళంతా వాడికేసి చూసి నవ్వుకుంటూ ముంజుల్ని మింగేస్తున్నారు

ఆ తర్వాత కొబ్బరి తోటలో కెళ్ళి గోపన్న తీసిన లేత కొబ్బరి కాయల నీటిని త్రాగి బ్రేవ్ మని త్రేన్చేశారు

మరికొంత సేపటికి ఇంటి నుంచొచ్చిన వంట పదార్థాలన్ని ఖాళీ చేసేసారు

గిరిశం కోరిన మీదట గోపన్న మళ్ళి కొబ్బరి బొండాల్ని కొట్టి తెచ్చేడు

సాయంత్రం దాకా అక్కడే పేకాడ్తూ నూ చున్నారు వాళ్ళు

ఒరేయ్ గోపన్నా! వెళ్ళి వేరుశనక్కాయలు పట్రారా! గుత్తి శనక్కాయలు ఎప్పుడూ తినెరగరు"

ఒచ్చిండి బాబు. ' ఒట్టి ఎండెలు ' మొన్ననే పువ్వురాల్చేయి" గోపన్న సమాధాన మిచ్చేడు

పర్లేదు ! మే మెత్తమ్మవుతాంలే !"

అదికాదు . మరి ." లేత మొక్కలు పీకేస్తే మిగతావి చెడపోతాయి" గోపన్న అయిష్టంగా ముఖం పెట్టి అన్నాడు ఆ తర్వాత తప్పనిసరిగా గిరిశం చెప్పినట్టు చెయ్యక తప్పలేదు గోపన్నకి

ఒక్కొక్క మొక్కనీ వేళ్ళతో పెకిలించి కాయలేరు తున్నాడే గాని గోపన్న మనసొప్పడం లేదు.

తన చేతి వేళ్ళని తానే బలవంతంగా లాక్కుంటున్నట్టుగా తన తలను తానే నరుక్కుంటున్నట్టుగా యిదైపోయేడు గోపన్న.

క్షణాల మీద వాటిని కాల్చి వాళ్ళ ముందుంచేడు.

ఆ తర్వాత మరికొంత సేపటికి "కొట్టంలో గడ్డంతా పశువులు తినేశాయి.. .. ఏం మిగల్లేదు . రేపటికి గొడ్లకి మేయడానికేంలేదు నే పోతాబాబూ!" అంటూ పశువుల మేత కోసుకు రావడం కోసం బయల్దేరేడు.

ఇంట్లో ఆరోజు రాత్రి గిరిశం ఫ్రండ్సుతో భోజనానికి సిద్ధమయ్యేడు.

వాళ్ళడిగింది లేదనకుండా, తిన్నది తినకుండా అన్నీ వాళ్ళ ముందు ప్లేట్లలో పెట్టింది అన్నపూర్ణమ్మ

అన్నేసి వంటకాల్ని చూసేసరికి గోపన్నకి ఆశ్చర్యమేసింది

పట్నపోళ్ళు అన్ని ముందుంటే గాని భోజనం సహించదేమో? అన్పించింది వాడికి

పండగ శెలవులు ముగిసాయి.

గిరిశం మళ్ళి పట్నం వెళ్ళిపోయేడు.

* * *

ఏపుగా పెరిగిపోయిన పంట పొలాలు అప్పుడే కోతకొచ్చేశాయి

ఈ మధ్య రాత్రిళ్ళు ఊర్లోని ఊరపందులు వేరుశనగ పంట చేలల్లో ప్రవేశించి మొక్కల్ని పెరికేస్తూ కాయల్ని తినేస్తుండడంతో రైతులందరూ ఒళ్ళంతా కళ్ళు చేసికొని మరి కాపలా వుంటున్నారు.

ఎప్పటిలాగే ఆ రాత్రి కూడా శంకరయ్యతో కలిసి పొలాన్ని కాసేందుకు బయల్దేరేడు గోపన్న.

"ఏరా గోపన్నా... ?" ఊర పందు లియ్యాలయినా మనల్ని నిద్రోనిస్తాయంటావా?! ఈ మధ్య మరి కంటికి నిద్రే కరువై పోయిందిరా!" శంకరయ్య గోపన్నతో అంటున్నాడు

'ఎందుకు చిన్నయ్యగారూ . ? మీరు శాల్లో పడుకోండి ఆటిపని నే పడ్తా"

"నడిరేయి! నువ్వొక్కడివే?"

గోపన్న మాటలకు శంకరయ్య నవ్వుకున్నాడు

కొంత సేపలా పొలం చుట్టూ పచార్లు చేసొచ్చి నిద్రకుపక్రమించే రిద్దరూను.

గోపన్నకు మాత్రం నిద్ర రావడం లేదు.

ఎక్కడో దూరాన్నుంచి సన్నగా విన్పిస్తున్నాయి నక్కలరుపులు.

ఆకాశంలో చంద్రుడు వెన్నెల్తో ఆటలాడు కుంటున్నాడు.

ప్రశాంతంగా వుంది వాతావరణం!

భరించలేనంతటి నిశ్శబ్దం!

గోపన్న కెందుకో ఆ నిశ్శబ్ద వాతావరణానికి కాస్తంత భయం కూడా వేసినట్టనిపించింది!

ప్రక్కనే శంకరయ్యప్పుడే గుర్రు పెడుతున్నాడు.

గోపన్న బలవంతంగా కళ్ళు మూసుకుని నిద్రపోయే ప్రయత్నం చేయసాగేడు

ఐనా నిద్దర పట్టి చావడం లేదు

అల్లంత దూరాన చీకటి నంతా ఒక్క పోగు చేసినట్టు నల్లని కొండలు జుగుప్సాకరంగా అగుపిస్తున్నాయ్

గోపన్న ఒక్క మాట సాల బయటి కొచ్చి పొలాలన్నీ కలియ జూసి మళ్ళి పక్కమీద నడుం వాల్చేడు

అర్ధరాత్రి దాటి పోయింది!

ఎప్పుడు కళ్ళు మూతలుపడ్డాయో తనకే తెలీదు.

మరికొంత సేపటికి గోపన్న ఏదో పెద్ద అలికిడిగా అన్పించి తెలివిలో కొచ్చేడు.

అక్కడో దూరాన్న పిడుగు పడ్డ శబ్దం!

ఆకాశం నల్లని మేఘాల్తో దట్టంగా కన్పిస్తోంది

"వర్షం వచ్చేటట్టుంది!" తనలో తానే గొణుక్కున్నాడు గోపన్న.

చీకటికి భయపడి వెన్నెల మటుమాయమై పోయింది. చంద్రుడి జాడ ఎక్కడా కన్పించలేదు.

సనసన్నని చినుకులు హఠాత్తుగా గాలివానగా మారిపోయింది.

"చిన్నయ్యా! . . చిన్నయ్యా!!...." గోపన్న భయంగా పిల్చేడు

శంకరయ్య పలకలేదు.

"చిన్నయ్యగారూ.. ."

గోపన్న గొంతు హెచ్చించేడు పక్క మీది నుంచి లేచి.


"ఏంద్రా? .... ఏంవయ్యింది?" శంకరయ్య బద్ధకంగా అడిగేడు దుప్పటి మీదకు లాక్కుంటూ.

"వానయ్యా . . . వాన!"

"అయితే?"

"అద్గాదు చిన్నయ్య గారూ !? మరో ఆయకట్టు వేయలేదు గదా . కాలవలోని నీరంతా పొలంలోకి పోద్దీ!"

గోపన్న ఆత్రంగా అంటున్నాడు



నిన్నగాక మొన్ననే పొలానికి నీరవసరమైతే ఆయకట్టు తీసి కాలవ నీటిని మళ్ళించేరు.

ఎం కాదులే! నువ్ పడుకో.. .. కాలవ నిండేక కదా ఆయకట్టు ద్వారా నీరొచ్చేది " నిమ్మళంగా అంటున్న శంకరయ్య మాటలు గోపన్నకి చిరాకనిపించింది

వర్షం మరింత వుధృత మైంది.

. .. యీపాటికి కాలవ నిండి పోయి వుంటుంది.

/రెపో మాపో కోతకొచ్చిన పంట ! నీట పాలయి పోతోంది.

తెను అలా జరగడానికి వల్లేను

'చిన్నయ్యా.. . నే బోతా'

ఒక్క ఉదుటున శాల బయట కొచ్చి పరుగు లంకించు కున్నాడు గోపన్న పార చేతపట్టుకుని.

"ఒరేయ్ ! .. ఏంద్రా? న ఎచ్చి ఒరేయ్!

యింత వర్షంలో ఎందుకురా.. . ?!"

గాలివాన హోరులో శంకరయ్య అరుపులు కలిసి పోయేయి

"ఒట్టి మూర్ఖపు యెదవ .... పోని"

శంకరయ్య చలికి కాళ్ళు ముడుచుకుని దుప్పటి సర్దుకున్నాడు.

ఏర్లై పారుతున్న నీటిని అడ్డంగా గట్టు తవ్వి పారతో మట్టిని పోస్తున్నాడు గోపన్న

అంతచలిలోనూ వాడికి పంటని కాపాడు కోవాలన్న తాపత్రయం తప్ప మరో ధ్యాసలేదు

నీరు మోకాళ్ళను దాటి ప్రవహిస్తోంది.

అంతకంతకూ వాన పెరుగుతోందే తప్ప తగ్గుముఖం సూచనలు కనిపించడంలేదు!

అప్పుడే పొలంలో నీరు సగానికి పైగా ప్రవేశించింది!

ఐనా గోపన్న ప్రయత్నం మానడం లేదు

గట్టుతవ్వి ఆయకట్టుకు అడ్డంగా పోగు వేస్తూనే వున్నాడు. ఐనా నీరు నిలవడం లేదు.

గట్టుకావలనున్న ఇందరాయిల్ని ఒక్కొక్కటి మోసి తెచ్చి పడేస్తున్నాడు.

అవి కూడా నీటి ప్రవాహానికి తట్టుకో లేక పోతున్నాయి ఇట్టే కొట్టుకు పోతున్నాయి.

ఇదంతా ఎవరో కక్షకొద్దీ చేస్తున్నట్టుని పిస్తోంది గోపన్నకి.

## మూగరాగాలు

క్షణక్షణానికి గోపన్నలో ఆశ సన్నగిల్లి పోతోంది.

తను కంటికి రెప్పలా చూసుకున్న పంట తన కళ్ళ ముందే నాశనమై పోతోందిప్పుడు.

పైన ఓ పెద్ద మెరుపు!

ఆపైన ఓ భయంకరమైన ఉరుము !!

వెనువెంటనే పిడుగు పడ్డ చప్పుడు!!!

తన పని పూర్తయినట్టుగా వాన హఠాత్తుగా ఆగిపోయింది.

తెలివికున్న శంకరయ్య కళ్ళు నులుపుకుని బయటి కొచ్చేడు. చిన్న చిన్న చినుకులింకా పడుతూనే వున్నాయి.

"వరద కాబోలు ! పెద్ద వానే ! "ఏడీ కుర్ర వెధవ..... " యేమయ్యేడు?!"

చుట్టూ పరికించి చూసేడు గోపన్న కోసం.

అంతా చీకటిగా వుంది.

అంతలో తనకు యింకొంత దూరాన్నుంచి మూడు మానవాకారాలు తనవేపే కదిలి రావడం గమనించేడు శంకరయ్య.

"ఏందినాన్నా! ఈ వేళప్పుడు ....?!"

శంకరయ్య తండ్రిని చూసి అన్నాడు.

"అద్సరేగాని గోపన్నేడ్రా?.... ఎక్కడ?"

"అదే! నే చూస్తున్నా.... ! నాపక్కనే పడున్నోడేమైనాడాని?!"

లైటర్ చేతో పట్టుకుని పొలంకేసి గురిచూసి పెట్టేడు రాఘవయ్య.

అంతా జలమయమై వుంది.

"అవున్రా!..... యీఏడు పంట.... కొడుకునుద్దేశించి అంటున్న రాఘవయ్య స్వరం హీనంగా విన్పించింది.

చుట్టుపట్ల నున్న సుమారు వందెకరాల పొలమూ నీటిలో మునిగి పోయింది.

అందులో కొండయ్య పొలము కూడా వుంది.

"ఆఁ! అన్నట్టు పంటంటే గుర్తొచ్చిందిప్పుడు! అర్ధరేత్రి యీ గుంటడు వర్షంలో పొలంలోనికి పారతో పరుగెత్తుకెళ్ళేడు నాన్నా" శంకరయ్య తండ్రితో చెప్పేడు.

"వర్షంలో పారతో నా.... ?!"

రాఘవయ్య పొలంకేసి నడిచేడు తొందర తొందరగా

ఆ వెంటనే శంకరయ్య బయల్దేరేడు తండ్రి వెనకగా మిగతా ముగ్గురు మనుషులు కూడా.

వాళ్ళని అనుసరించేరు. నీట్లో అడుగులు తడబడుతున్నాయి! కొంతసేపట్లో ఆయకట్టుకు అడ్డంగా పడివున్న గోపన్న శవాన్ని చూసి అందరూ దిగ్భ్రాంతి చెంది పోయేరు.

"నే వద్దురా అన్నా విన్పించుకోలేదు .... వెధవ! ప్రాణాల్ని పోగొట్టుకున్నాడు!"

కొడుకంటున్న మాటలు రాఘవయ్యకి విన్పించడం లేదు.

"అయ్యగారూ! మన పంటంతా నీటి పాలయి నాశన మయ్యింది.... ఇప్పుడెవర్ని శిక్షించాలి? చెప్పండి!"

గోపన్న మౌనంగా ప్రశ్నిస్తున్న మాటలే ఆయన చెవుల్లో ప్రళయ ఘోషగా విన్పిస్తున్నాయి.

మరునాడు దినపత్రికల్లో పెద్ద పెద్ద అక్షరాల్తో 'నీటి పాలైన పంటచేలు– ఈ యేడు పెద్ద ఆహార సమస్య తెచ్చి పెట్టిన వరద నీళ్ళు' అన్న వార్త పడింది.

వరండాలో పేపరు చదువుతున్న రాఘవయ్య పక్కనే కూర్చుని దేనికోసమో ఎదురు చూస్తున్న మనవరాల్ని గమనించలేదు.

"తాతయ్య ! గోపన్న యిక రాడా?" చిన్ని ప్రశ్న.

"రాడమ్మా!"

"ఏం?"

"చచ్చిపోయేడు!"

"మరి అప్పుడు కొండయ్య మనుషులు సీన గోపన్నని కొట్టితే ఆళ్ళ పశువుల్ని కట్టేశారు. ఇప్పుడు ఆ కొండయ్య పొలాలూ మన పొలాలూ కూడా నీట్లో కొట్టుకు పోయేయి కదా! మరి మీరంతా ఎవర్ని కట్టి పడేయాలి?!"

చిన్ని మాటలకు మూగపోయిన రాఘవయ్య మనవరాల్ని ఆప్యాయంగా హృదయానికి హత్తుకోవడం తప్ప వేరే సమాధాన మివ్వలేక పోయేడు! □

